అయిలాపూర్‌లో వృద్ధుల సమస్యలు వింటున్న కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కల్వకుంట్ల

కల్వకుంట్ల సంజయ్ 'మార్నింగ్ వాక్'

కోరుట్ల రూరల్, జనవరి 10: ప్రజా సమస్యల పరిష్కారం కోసం కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ కల్వకుంట్ల సంజయ్ బుధవారం కోరుట్ల మండలం అయిలాపూర్‌లో 'మార్నింగ్ వాక్' చేశారు. ఉదయం ఆయన గ్రామంలో పర్యటించారు. అనారోగ్య సమస్యలతో బాధ పడుతున్న మహిళలు, వృద్ధులను పరీక్షిస్తూ ముందుకెళ్లారు. ఈ సందర్భంగా గ్రామస్తులు పలు సమస్యలను తన దృష్టికి తేగా, పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని అధికారులను ఎమ్మెల్యే ఆదేశించారు. కాలనీల్లో పారిశుధ్య పనులు చేపట్టాలని, ఇంటింటికీ మిషన్ భగీరథ నీరు వచ్చేలా చూడాలని సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో సర్పంచ్ పిడుగు రాధ, బీఆర్ఎస్ మండ లాధ్యక్షుడు దారిశెట్టి రాజేశ్, బీఆర్ఎస్ గ్రామ శాఖ అధ్యక్షుడు బండి నరేశ్, ఎంపీటీసీ బోడ గంగాధర్, నాయకులు చింతకుంట సాయిరెడ్డి, పిడుగు సందయ్య, దీకొండ రాజనర్సయ్య, సత్యనారాయణ, బాబూరావు, తుక్కారెడ్డి, నరేశ్, ఎంపీవో నీరజ, కార్యదర్శి నవీన్ పాల్గొన్నారు.

14వ సామాజిక తనిఖీ

ఇబ్రహీంపట్నం, జనవరి 10: మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ 14వ సామాజిక తనిఖీ బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా అధికారులు 2022 జనవరి 23 మార్చి వరకు గానూ 17 గ్రామాల్లో రూ.2,71,93వేల పనులు చేపట్టినట్లు డీఆర్‌డీవో నరేశ్ తెలిపారు. పనుల్లో అవకతవకలు జరుగగా రూ.68,844 నగదును రికవరీకి ఆదేశించినట్లు ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో జిల్లా విజిలెన్స్ అధికారి చిన్నయ్య, అంబుడ్స్‌మెన్ కృష్ణారెడ్డి, జిల్లా అసిస్టెంట్ విజిలెన్స్ అధికారి దేవేందర్‌రెడ్డి, ఎస్ఆర్‌పీ తిరుపతి, ఎంపీవో కృపాకర్, ఏపీవో వినోద్ పాల్గొన్నారు.

జాతీయ స్థాయి పోటీలకు ఎండపల్లి విద్యార్థి..

వెల్గటూర్, జనవరి 10: ఎండపల్లి మండల కేంద్రానికి చెందిన సబ్బ మానస జాతీయస్థాయి అథ్లెటిక్ క్రాస్ కంట్రీ పోటీలకు ఎంపికైనట్లు జిల్లా అథ్లెటిక్స్ కార్యదర్శి ఏలేటి ముత్తయ్యరెడ్డి, కోశాధికారి బైకని కొమురయ్య తెలిపారు. ఇటీవల జరిగిన రాష్ట్ర స్థాయి పోటీల్లో ప్రతిభ చూపి పోటీలకు ఎంపికైంది. ఈ నెల 15న బీహార్‌లో జరిగే పోటీల్లో పాల్గొనున్నట్లు వారు తెలిపారు.

రాష్ట్ర స్థాయి పోటీలకు..

ధర్మపురి, జనవరి 10: రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీలకు గొల్లపల్లి (మగ్గిడి) గురుకుల విద్యార్థి ఎన్ చందు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ రాజమణి తెలిపారు. జిల్లా కేంద్రంలో జరిగిన జిల్లా స్థాయి పోటీల్లో ప్రతిభ చూపి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక కాగా పాఠశాల పీడీ శ్రీనివాస్, ఉపాధ్యాయులు అభినందించారు.

మాట్లాడుతున్న డైరెక్టర్ ఆఫ్ రీసెర్చ్ రఘురాంరెడి

యూనివర్సిటీ విద్యార్థులు తయారు చేసిన ఉత్పత్తులు

కిసాన్ మేళా సక్సెస్

- తరలివచ్చిన మూడు ఉమ్మడి జిల్లాల రైతుల
- నువ్వుల పంటపై సంపూర్ణ అవగాహన
- యంత్రాల వినియోగం, సబ్సిడీలను వివరించిన అధికారులు

జగిత్యాల టౌన్, జనవరి 10 : పొలాస ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా స్థానంలో ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ విశ్వవిద్యాలయం, భారత వ్యవసాయ పరిశోధనా మండలి, యూనియన్ బ్యాంక్, భారత నూనెగింజల అభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన కిసాన్ మేళా విజయవంతమైంది. ఉమ్మడి కరీంనగర్, ఆదిలాబాద్, నిజామాబాద్ జిల్లాల నుంచి రైతులు పెద్ద సంఖ్యలో తరలిరాగా, వ్యవసాయ శాస్త్రవేత్తలు, ఇతర అధికారులు నువ్వులు, ఇతర నూనె పంటలపై సంపూర్ణ అవగాహన కల్పించారు. వివిధ పబ్లిక్ (వెటర్నరీ కాలేజి, వ్యవసాయ శాఖ, ఫుడ్ సైన్స్ కాలేజ్, ఉద్యానవన శాఖ, సంబంధిత శాఖలు), ప్రైవేటు రంగాలకు సంబంధించిన పరికరాలు, వ్యవసాయ పనిముట్లు, కొత్త సాంకేతిక విధానంతో సుమారు 45 స్టాళ్ళను ఏర్పాటు చేయగా, కలెక్టర్ షేక్ యాస్మిన్ భాషా ప్రారంభించారు. ఇక్కడ జిల్లా అధికారులు, ఉత్తర తెలంగాణ మండ ల సహపరిశోధన సంచాలకులు డాక్టర్ జీ శ్రీనివాస్, అసోసియేట్ డీన్ డాక్టర్ భారతిభట్ట, ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ మోదర్‌రాజు, ఆదిలాబాద్ కాలేజ్ డీన్ డాక్టర్ శ్రీధర్ చౌహాన్, వ్యవసాయ అధికారులు, రైతులు పాల్గొన్నారు. డాక్టర్ ఎస్ వాణిశ్రీ, నూనెగింజల ప్రధాన శాస్త్రవేత్త నువ్వులు, కుసుమా లు, ప్రొద్దుతిరుగుడు, వేరుశనగలో సాగు వివరాలను గూర్చి రైతులకు క్లుప్తంగా వివరించారు.

హాజరైన రైతులు

రైతులకు నిరంతరం శిక్షణ ఇవ్వాలి

ఆధునిక సాంకేతిక పద్ధతుల వినియోగం, పంటల్లో యాజమాన్యం తదితరాలపై రైతులకు నిరంతరం శిక్షణ ఇవ్వాలి. ఉపాధి హామీ పథకంలో వ్యవసాయ పనులను చేర్చాలి. విదేశాలకు ఎగుమతి చేసే పంటల్లో ఎటువంటి ఫెస్టిసైడ్స్ వాడాలి. ఎంత మొత్తంలో వాడాలన్న దానిపై శిక్షణ అందించాలి. మేము పండించిన పంటలను పరీక్షించేందుకు పరీక్షా కేంద్రాలను మాకు అందుబాటులో ఏర్పాటు చేయాలి.

-పాలెపు రాము, రైతు, నిజామాబాద్ జిల్లా మోర్తాడ్

మార్కెటింగ్ సదుపాయం కల్పించాలి

ఆరుతడి పంటల ఉత్పత్తులకు ప్రభుత్వం మద్దతు ధర లభించేలా మార్కెటింగ్ సదుపాయం కల్పించాలి. ప్రభుత్వ రంగ సంస్థల ద్వారా కొనుగోలు చేయించాలి. దీనివల్ల రైతులకు ఎటువంటి నష్టం వాటిల్లదు. వరికి ప్రయత్నాయ పంటలను ఎంచుకుంటాం.

- ఎన్నం మధుకర్‌రెడ్డి, రైతు, ధర్మపురి మండలం జైన

జంతువుల నుంచి పంటలను రక్షించాలి

నువ్వులు, పల్లీ, శెనగ వంటి పంటలను సాగు చేస్తే జంతువుల పంటలకు నష్టం కలిగిస్తున్నాయి. జంతువుల నుంచి మా పంటలను కాపాడే విధంగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి. నష్టపోయిన రైతులకు నష్టపరిహారం అందించాలి.

-పెండూర్ నాగేశ్వర్, రైతు, ఆదిలాబాద్

శిక్షణా కార్యక్రమాలు ఏర్పాటు చేస్తాం

రైతులు విదేశాలకు ఎగుమతి చేయాలంటే మినిస్ట్రీ ఆఫ్ ఆమర్స్ సంస్థ ద్వారా సర్టిఫికెట్ తీసుకోవాలి. ఎగుమతి చేసే నూనెగింజల సాగుపై శిక్షణా కార్యక్రమాలు ఏర్పాటు చేస్తాం. రైతు నేరుగా ఎగుమతి చేయాలంటే పరిశోధనా కేంద్రాల నుంచి అగ్రిమెంట్ చేసుకోవాలి. రైతులకు లాభం చేయాలన్న ఉద్దేశంతో ఈ మేళా నిర్వహించాం. విదేశాలకు మన భారత దేశం నుంచి ఎక్కువ మొత్తంలో ఎగుమతి చేసి ప్రపంచ దేశాల్లో నెంబర్ వన్‌గా ఎదగాలి. నువ్వులు చాలా ఎక్కువ శాతం విదేశాలకు ఎగుమతిలో రిజక్ట్ అవుతున్నాయి. నువ్వు సాగులో పెస్టిసైడ్స్‌ను ఎక్కువ వాడటం వల్ల ఈ విధంగా జరుగుతుంది. నాణ్యతా ప్రమాణాలు తప్పనిసరిగా పాటించాలి. యాసంగిలో సాగు చేసే నువ్వు పంటలో ఎక్కువ నాణ్యత ఉంటుంది. ప్రతి పంటలో మేలైన యాజమాన్య పద్ధతులను పాటించాలి. ముఖ్యంగా విదేశాలకు ఎగుమతి చేయాలంటే పెస్టిసైడ్స్ అవశేషాలను తగ్గించేలా సాగు చేయాలన్నారు. జపాన్ మన దేశం నుంచి నూనె గింజల ఎగుమతిని 30 ఏళ్లుగా నిలిపివేసింది.

- రమేశ్‌కొల్లా, డిప్యూటీ సీఈవో

నూనె గింజల సాగుపై మక్కువ చూపాలి

రైతులు నూనె గింజల సాగుపై మక్కువ చూపాలి. నూనె గింజల ఎదుగమతులపై సలహాలు, సూచనలు కావాలంటే 24 గంటలు రైతులకు అందుబాటులో ఉంటా. నూనె గింజలను ఎక్కువ మొత్తంలో సాగు చేసే రైతులకు అవార్డులు ఇస్తాం. ఎగుమతులు చేసుకునే దేశాలు వాటికి అనుగుణంగా మంచి నాణ్యతతో నువ్వులను సాగు చేయాలి.

- కిశోర్ థాన, కన్వీనర్

ఉత్తర తెలంగాణ నువ్వుకు అనుకూలం

నువ్వులను రాణిగా పిలుస్తుంటాం. పురాతన కాలం పంట అయినప్పటికీ కొన్నేళ్లుగా నువ్వుల సాగు తగ్గుముఖం పడుతున్నది. ఉత్తర తెలంగాణ ప్రాంతం నువ్వు సాగుకు అనుకూలమైంది. నాణ్యమైన నువ్వులను ఎక్కువ మొత్తంలో సాగు చేసిన రైతులకు అవార్డులు అందిస్తాం.

-డాక్టర్ ఆనంద్‌కుమార్ విశ్వకర్మ , ప్రాజెక్ట్ డైరెక్టర్

రైతులను శాస్త్రవేత్తలుగా గుర్తించాం

కిసాన్ మేళాలో రైతులను కూడా ఒక శాస్త్రవేత్తగా గుర్తించాం. రైతులు మాకంటే ఎక్కువగా కొత్త పద్ధతులు తెలుసుకొని పంటలను సాగు చేస్తున్నారు. కోతుల, అడవి పందుల బెడద నుంచి కాపాడుకోవడానికి రైతులు వివిధ రకాల పరికరాలను తయారు చేస్తున్నారు. వాటికి మేళాలో ఒక స్టాల్ ఏర్పాటు చేయడం అభినందనీయం.

- డాక్టర్ కల్పన, ఫుడ్‌సైన్స్ కళాశాల డీన్

ఎమ్మెల్యేకు శుభాకాంక్షలు తెలుపుతున్న సీనియర్ సిటిజన్స్

సీనియర్ సిటిజన్లు సమాజ మార్గదర్శకులు

జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్‌కుమార్

జగిత్యాల కలెక్టరేట్, జనవరి 10: సీనియర్ సిటిజన్లు, పెన్షనర్లు సమాజానికి మార్గదర్శకులని జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్ అన్నారు. తెలంగాణ పెన్షనర్స్ అసోసియేషన్, తెలంగాణ ఆల్ సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్ ప్రతినిధులు ఎమ్మెల్యేను కలిసి నూతన సంసవత్సర శుభాకాంక్షలు తెలిపి ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, పెన్షనర్లు, సీనియర్ సిటిజన్ల సమస్యల పరిష్కారానికి, పాత పెన్షన్ పునరుద్ధరణకు కృషి చేస్తానన్నారు. వయోవృద్ధుల చట్టంలో బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలోనే పలు ప్రయోజనకరమైన సవరణలు చేశామన్నారు. కార్యక్రమంలో ఆ సంఘం ప్రతినిధులు హరి అశోక్‌కుమార్, బొల్లం విజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేను కలిసిన పబ్లిక్ ప్రాసిక్యూటర్

జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్‌కుమార్‌ను జిల్లా కోర్టు పబ్లిక్ ప్రాసిక్యూటర్ త్రిపుర బుధవారం మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. పలు అంశాలపై చర్చించారు.

మున్సిపల్ చైర్మన్ ఎన్నిక చేపట్టండి

జగిత్యాల, జనవరి 10: జగిత్యాల మున్సిపల్ చైర్‌పర్సన్ ఎన్నిక చేపట్టాలని ఇన్‌చార్జీ మున్సిపల్ చైర్మన్ గోలి శ్రీనివాస్ కలెక్టర్ యాస్మిన్ బాషాకు వినతిపత్రం అందజేశారు. బోగ శ్రావణి రాజీనామా తర్వాత వైస్ చైర్మన్‌గా ఉన్న తనకు ఇన్‌చార్జి చైర్మన్‌గా గతేడాది జనవరి 31న బాధ్యతలు అప్పగించారని చెప్పారు. ఎన్నికల నియమావళి ప్రకారం చైర్మన్ ఎన్నిక కోసం తగిన చర్యలు తీసుకోవాలని కలెక్టర్‌కు ఇచ్చిన లేఖలో పేర్కొన్నారు.

28 మంది అంగన్‌వాడీ టీచర్లకు పదోన్నతి

జగిత్యాల కలెక్టరేట్, జనవరి 10: జిల్లాలోని 28 మంది మినీ అంగన్‌వాడీ టీచర్లను మెయిన్ అంగన్‌వాడీ టీచర్లుగా పదోన్నతి కల్పిస్తూ ప్రభుత్వం జీవో 37ను విడుదల చేసింది. ఈ నేపథ్యంలో ధర్మపురి ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలో గల 16 మంది మినీ అంగన్‌వాడీ టీచర్లకు కలెక్టర్ షేక్ యాస్మిన్ బాషా కలెక్టరేట్‌లో బుధవారం పదోన్నతి పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ కార్యాలయంలో అంగన్‌వాడీలు, ఐసీడీఎస్ సిబ్బది కేక్ కట్ చేసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా సంక్షేమాధికారి ఆడెపు భాస్కర్, ధర్మపురి ఐసీడీఎస్ సీడీపీవో వాణిశ్రీ, సూపర్‌వైజర్లు శైలజ, లత, నీలిమ, విజయలక్ష్మి, ఆండాలు, పోషన్ అభియాన్ కో ఆర్డినేటర్ ప్రణీత, అంగన్‌వాడీ టీచర్లు, అధికారులు పాల్గొన్నారు. అలాగే తెలంగాణ దివ్యాంగుల పట్టభద్రుల సంఘం(టీడీజీఏ) 2024 నూతన సంవత్సర క్యాలెండర్‌ను కలెక్టర్ ఆవిష్కరించారు.

నేడు పొలాస వ్యవసాయ కళాశాల బంద్

జగిత్యాల టౌన్, జనవరి 10: పొలాస వ్యవసాయ కళాశాలకు గురువారం విద్యార్థులు బంద్‌కు పిలుపునిచ్చారు. ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ రాష్ట్ర విశ్వవిద్యాలయంలోని భూములను ఆక్రమించి నూతన హైకోర్టు నిర్మించాలని, అందుకు గానూ 100 ఎకరాల భూమిని రాష్ట్ర ప్రభుత్వం జీవో నంబర్ 55 పేరిట విడుదల చేసినందుకు నిరసనగా పొలాస కళాశాలకు ఒక రోజు బంద్ పిలుపు ఇచ్చినట్లు విద్యార్థులు ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

ఎస్పీని కలిసిన కోరుట్ల ఎమ్మెల్యే

మారుతీనగర్, జనవరి 10: జిల్లా ఎస్పీ సన్‌ప్రీత్ సింగ్‌ను బుధవారం ఆయన కార్యాలయంలో కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కల్వకుంట్ల మర్యాదపూర్వకంగా కలిశారు. నియోజకవర్గంలో అభివృద్ధి, పనులు శాంతియుత వాతావరణంలో జరగడానికి సహకరించాలని ఆయన కోరారు. అలాగే కలెక్టర్ యాస్మిన్ బాషాను కూడా ఎమ్మెల్యే మర్యాదపూర్వకంగా కలిశారు.

మధ్యాహ్న భోజనానికి విరాళం

మల్యాల, జనవరి 10: మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్ విద్యార్థులకు భోజనం అందించేందుకు మండల కేంద్రానికి చెందిన ఆర్మీ జవాన్లు కీసర గణేశ్, వడ్డెపల్లి నరేశ్, మారంపల్లి అవినాశ్ బియ్యంతో పాటు నిత్యావసరాల సరుకులను బుధవారం అందించారు. అదే విధంగా జగిత్యాలకు చెందిన వ్యాపారి మధు రూ.10 వేల నగదును ప్రిన్సిపాల్‌కు అందించారు. కార్యక్రమంలో ఇంటర్మీడియట్ నోడల్ అధికారి బొప్పరాతి నా రాయణ, అధ్యాపకులు పాల్గొన్నారు.

కేంద్ర మంత్రికి ఎంపీ లేఖ

జగిత్యాల, జనవరి 10: జిల్లా కేంద్రంలో ప్రాంతీయ పాస్‌పోర్ట్ కార్యాలయాన్ని ఏర్పాటు చేయాలని నిజామాబాద్ ఎంపీ అర్వింద్, కేంద్ర విదేశీ వ్యవహారాల శాఖ మంత్రి జయశంకర్‌కు లేఖ రాశారు. ఈ సందర్భంగా ఎంపీ లేఖ ద్వారా జిల్లా కేంద్రంలో ప్రాంతీయ పాస్ పోర్ట్ కార్యాలయాన్ని ఏర్పాటు చేయాల్సిన ఆవశ్యకతను మంత్రికి లేఖలో తెలియజేశారు.

చదువులో వెనుకబడుతున్నాని..

ఇబ్రహీంపట్నం, జనవరి 10: చదువులో వెనుకబడుతున్నానని మనస్తాపంతో గోదూర్‌కు చెందిన గడ్డం మోస్మి(17) ఆత్మహత్య చేసుకున్నదని ఎస్ఐ ఉమాసాగర్ తెలిపారు. బుధవారం ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. మోస్మి హైదరాబాద్‌లోని ప్రైవేట్ కళాశాలలో ఇంటర్ ఫస్ట్ ఇయర్ చేస్తున్నది.కొద్ది రోజులుగా ఆరోగ్యం సహకరించక చదువులో వెనుకపడుతానని మానసికంగా కుంగిపోయింది. డిసెంబర్ 12న ఇంట్లో ఎవరూ లేని సమయంలో పురుగుల మందు తాగింది. కుటుంబసభ్యులు గమనించి కరీంనగర్‌లో ఓ ప్రైవేట్ దవాఖానకు తరలించారు. అక్కడ పరిస్థితి విషమించి ఈనెల 9 మృతి చెందింది. తండ్రి లక్ష్మీనర్సయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ పేర్కొన్నారు.

మల్యాల ఎంపీపీపై అవిశ్వాసం వాయిదా

మల్యాల, జనవరి 10: ఎంపీపీ మిట్టపల్లి విమలపై ఏర్పాటు చేసిన అవిశ్వాస తీర్మానం హైకోర్టు ఆదేశాలతో వాయిదా వేసినట్లు జగిత్యాల ఆర్డీవో నర్సింహమూర్తి తెలిపారు. బుధవారం మండల పరిషత్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. తనపై అవిశ్వాసాన్ని నిలిపివేయాలని ఎంపీపీ విమల హై కోర్టును ఆశ్రయించగా, అవిశ్వాసాన్ని నిర్వహించరాదని కోర్టు మధ్యంతర ఉత్తర్వులు ఇచ్చిందని, కోర్టు ఉత్తర్వుల మేరకు వాయిదా వేసినట్లు వివరించారు. తదుపరి ఆదేశాలు వచ్చే వరకు అవిశ్వాసాన్ని నిర్వహించరాదని స్పష్టం చేశారు. మండల పరిషత్ కార్యాలయం వద్ద సీఐ కోటేశ్వర్, మల్యాల, కొడిమ్యాల ఎస్ఐలు తీగల అశోక్, వెంకట్రావ్ నేతృత్వంలో బందోబస్తును ఏర్పాటు చేశారు.

దరఖాస్తుల ఆన్‌లైన్ పరిశీలన

గొల్లపల్లి/మల్లాపూర్, జనవరి 10: ప్రజాపాలన దరఖాస్తుల ఆన్‌లైన్ ప్రక్రియను గొల్లపల్లి మండల పరిషత్ కార్యాలయంలో జిల్లా సీఈవో రఘువరణ్, మల్లాపూర్ మండలం కుస్తాపూర్, మల్లాపూర్ గ్రామాల్లో కోరుట్ల ఆర్డీవో రాజేశ్వర్ బుధవారం వేర్వేరుగా పరిశీలించారు. ఈ సందర్భంగా వారు ఆయాచోట్ల మాట్లాడుతూ, దరఖాస్తుల ఎంట్రీని తొందరగా పూర్తి చేయాలన్నారు.

నమస్తే తెలంగాణ CLASSIFIED

NAME CHANGE

పోలు శారద వాణి D/o. పోలు శంకరయ్య (పెళ్లికి ముందు) అనునా పేరును పెళ్లి తరువాత స్వర్గం వాణి W/o. స్వర్గం నరేష్ గ్రా & మం॥ హుజురాబాద్, జి॥ కరీంనగర్, T.S గా మార్చబడినది.

CHANGE OF NAME

★I, GOGURI MADHUSUDAN, R/o. 8-5, Sriramulapally, Kodimial, Jagityal, TS. I have Changed My Name as GOGURI MADHUSUDHAN REDDY, S/o. Goguri Raji Reddy.
NT-319326

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధము లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

Classified Ads
మీకు కావలసిన సమాచారం కొరకు సులభమైన మార్గం.. మన నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్‌లో ప్రకటన ఇవ్వడం
4 లైన్ల ప్రకటన కేవలం 200/- మాత్రమే
ప్రతి ఎక్స్‌ట్రా లైన్‌కి 50/- మాత్రమే
3+1 స్కీం కలదు
ప్రకటనల విభాగం...
GST 5% వర్తించును
Cell: 91827 77571
91827 77194

సామిల్‌లో అగ్నిప్రమాదం

కోరుట్లలోని సామిల్‌ను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కల్వకుంట్ల

- రూ. 1.50 కోట్ల విలువైన టేకు కలప దగ్ధం
- కోరుట్ల సామిల్‌ను పరిశీలించిన ఎమ్మెల్యే సంజయ్ కల్వకుంట్ల

కోరుట్ల, జనవరి 10: పట్టణంలోని గడి గురుజు సమీపంలో ఉన్న సోఫియాన్ సామిల్‌లో బుధవారం వేకువజాము ప్రమాదవశాత్తు అగ్ని ప్రమాదం జరిగింది. ఈ ప్రమాదంలో సామిల్‌లో నిల్వ ఉంచిన సుమారు రూ.1.50కోట్ల విలువైన టేకు కలపతో పాటు యంత్ర సామగ్రి అగ్నికి ఆహుతైంది. సంఘటనా స్థలాన్ని కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కల్వకుంట్ల పరిశీలించి ప్రమాదానికి గల కారణాలను సామిల్ యజమాని జకీరొద్దీన్‌ను అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వపరంగా ఆదుకునేందుకు తన వంతు కృషి చేస్తానని భరోసా కల్పించారు. కాగ విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగానే అగ్ని ప్రమాదం జరిగిందని సామిల్ యజమాని జకీరొద్దీన్ తెలిపారు. సామిల్‌ను జిల్లా అటవీ శాఖాధికారులు పరిశీలించారు. బాధితుడి ఫిర్యాదుతో పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

కొండగట్టు ఆలయ ఉద్యోగి చేతివాటం

తస్కరించిన కొండగట్టు ఆలయ ఉద్యోగిని విచారిస్తున్న పోలీసులు

- అంజన్న హుండీ లెక్కింపులో నగదును తస్కరణ
- గమనించి అధికారులకు సమాచారం ఇచ్చిన భక్తుడు
- తనిఖీల్లో రూ.11,010లు పట్టివేత
- పోలీసులకు అప్పగింత

మల్యాల, జనవరి 10 : కొండగట్టు ఆంజనేయస్వామి ప్రధాన ఆలయంతో పాటు అనుబంధ ఆలయాల్లోని హుండీ నగదు లెక్కిస్తున్న క్రమంలో ఓ ఉద్యోగి చేతివాటం ప్రదర్శించాడు. హుండీ నగదును తస్కరిస్తుండగా గమనించిన భక్తుడు అధికారులకు సమాచారం ఇవ్వడంతో వారు అతడిని పట్టుకుని మల్యాల పోలీసులకు అప్పగించారు. పూర్తి వివరాలిలా ఉన్నాయి. ఆంజనేయస్వామి ఆలయంలో హుండీలను విప్పి ఆలయ వ్రత మండపంలో బుధవారం లెక్కిస్తున్నారు. ఈ క్రమంలో స్వామి వారి దర్శనానికి వచ్చిన ఓ భక్తుడు ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేసుకుంటున్న క్రమంలో నగదును లెక్కిస్తున్న ఓ వ్యక్తి లోదుస్తుల్లో పెట్టుకుంటున్నట్లు గమనించాడు. దీంతో ఆ భక్తుడు అక్కడే ఉన్న ఏఎస్ఐ చిలుక శ్రీనివాస్, దేవాదాయ ధర్మాదాయశాఖ సహాయ కమిషనర్ చంద్రశేఖర్, ఆలయ ఈవో టంకశాల వెంకటేశంకు సమాచారం అందించాడు. దీంతో ఆలయ లడ్డు, పులిహోర ప్రసాద తయారీ కేంద్రంలో పని చేస్తున్న కొలగాని రవిని హుండీ లెక్కింపు నుంచి బయటకు తీసుకువచ్చి తనిఖీ చేయగా అతడి వద్ద రూ.500 నోట్లు 22, రూ.10 నోటు 1 లభ్యం కావడంతో రూ.11,010 హుండీలోని నగదు దొంగతనం చేసినట్టుగా భావించారు. వెంటనే మల్యాల సీఐ బిల్లా కోటేశ్వర్, ఎస్ఐలు తీగల అశోక్, కందుకూరి కుమారస్వామికి సమాచారం ఇవ్వడంతో పోలీసులు సదరు ఉద్యోగిని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు.

కంటతడి పెడుతున్న ఎంపీపీ లక్ష్మి

అడ్లూరి నీకు తగునా..

వెల్గటూర్, జనవరి 10: దళిత మహిళా ఎంపీపీపై అవిశ్వాసం పెట్టి మానసిక క్షోభకు గురి చేయడం నీకు తగునా అడ్లూరి లక్ష్మణ్ కుమార్ అని వెల్గటూర్ ఎంపీపీ కునమల్ల లక్ష్మి విలపించింది. బుధవారం ఆమె విలేకరుల సమావేశంలో మాట్లాడారు.

అంజన్న హుండీ ఆదాయం రూ.71.73 లక్షలు

మల్యాల, జనవరి 10: కొండగట్టు శ్రీ ఆంజనేయస్వామి సన్నిధానంలో హుండీలను బుధవారం లెక్కించగా రూ.71, 73,723 ఆదాయం సమకూరినట్లు దేవాదాయ, ధర్మదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్ చంద్రశేఖర్, ఈవో టంకశాల వెంకటేశం తెలిపారు. నగదుతోపాటు మిశ్రమ బంగారం 51 గ్రాము లు, మిశ్రమ వెండి 3 కిలోల 200 గ్రాము లు, విదేశీ కరెన్సీ 30 నోట్లు ఆదాయం రూపంలో సమకూరిందన్నారు.

గంజాయి పట్టివేత

పెగడపల్లి, జనవరి 10: మండల కేంద్రంలోని ఆర్టీసీ బస్టాండ్ వద్ద 1.720 కిలోల గంజాయిని పట్టుకున్నట్లు మల్యాల సీఐ బిల్లా కోటేశ్వర్ పేర్కొన్నారు. పెగడపల్లి పోలీస్‌స్టేషన్‌లో రాత్రి ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఎస్ఐ సీహెచ్ సతీశ్‌తో కలిసి సీఐ మాట్లాడారు. నమ్మదగిన సమాచారం మేరకు బస్టాండ్ వద్ద ఓ వ్యక్తి అనుమానాస్పదంగా ఉండగా ఎస్ఐ సతీశ్ నేతృత్వంలో పోలీస్ సిబ్బంది అతడిని తనిఖీ చేసినట్లు తెలిపారు. అతడి వద్ద నుంచి 1.720 కిలోల గంజాయి దొరికిందని, దీని విలువ రూ.35 వేలు ఉంటుందని, నిందితుడు వెంగళాయిపేట గ్రామానికి చెందిన రాచర్ల వంశీగా గుర్తించి, అతడి వద్ద గంజాయి, 2 సెల్ ఫోన్లు స్వాధీనం చేసుకున్నట్లు సీఐ వివరించారు. నిందితుడు వంశీపై కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు పేర్కొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

కొడిమ్యాల, జనవరి 10: మండల కేంద్రంలోని మోడల్ స్కూల్‌లో వచ్చే విద్యా సంవత్సరానికి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు స్కూల్ ప్రిన్సిపాల్ లావణ్య తెలిపారు. 6వ తరగతి ప్రవేశాలకు 7,8,9 మిగిలిన సీట్లకు దరఖాస్తు చేసుకోవాలన్నారు.

మాజీ ఎమ్మెల్యేపై ఆరోపణలు సహించం

మెట్‌పల్లి, జనవరి 10 : మాజీ ఎమ్మెల్యే కల్వకుంట్ల విద్యాసాగర్ రావుపై కొందరు చేస్తున్న ఆరోపణలను సహించేది లేదని మెట్‌పల్లి మున్సిపల్ చైర్‌పర్సన్ రాణవేని సుజాత స్పష్టం చేశారు. బుధవారం మున్సిపల్ కార్యాలయ ఆవరణలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. మున్సిపల్ కార్మికులకు వేతనాలను చెల్లించడంలో కొంత ఆలస్యమైందే తప్ప, డబ్బులు లేవని కాదని, కార్మికులను రెచ్చగొట్టే ప్రయత్నం చేయడం సరైన పద్ధతి కాదని సూచించారు. ఎమ్మెల్యేగా, ఖాదీ చైర్మన్ ఉన్న సమయంలో ఖాదీ స్థలాన్ని మున్సిపల్‌కు ఖాదీ నుంచి లీజ్‌కు ఇప్పించారని, సంవత్సరానికి రూ.15 లక్షలు చొప్పున మున్సిపల్ నుంచి లీజ్ డబ్బుల చెల్లింపునకు ఒప్పందం చేసుకున్నా మన్నారు. ఖాదీ గ్రామోద్యోగ్ ప్రతిష్ఠాన్ నుంచి మున్సిపల్‌కు